క్లుప్తంగా

ఆర్టీసీ సమస్యలు పరిష్కరించాలి



కడప జోనల్ చైర్మన్ నాగరాజును సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పలు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని ఆర్టీసీ యూనియన్ నాయకులు కోరారు. శుక్రవారం ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పూల నాగరాజును వారు అనంతపురంలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కరించేందుకు తమ వంతుగా తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పురుషోత్తం, వాసుదేవరెడ్డి, ఆంజనేయులు, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, గోపాల్, ప్రకాశ్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



వసీవుల్లా భక్తియారీని సన్మానిస్తున్న ప్రముఖులు

కడప ఎడ్యుకేషన్ : జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా నవంబర్ 11న కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ఉర్దూ అధ్యాపకుడు వసీవుల్లా భక్తియారీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం–2024 అందుకున్నారు. అలాగే ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్ర ఉర్దూ అకాడమి వారి పరిశోధన, విమర్శ విభాగంలో ప్రొఫెసర్ సులైమాన్ అథర్ జావేద్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ ఫర్ ఉర్దూ రీసెర్చ్ అండ్ క్రిటిసిజం–2024కు సంబంధించి న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి మంత్రి ఫరూక్ చేతుల అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కడపలో రాయలసీమ ఉర్దూ రైటర్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ సత్తార్ ఫైజీ, ఇక్బాల్ ఖుస్రూ ఖాద్రీ, ప్రెసిడెంట్ డాక్టర్ సయ్యద్, ఉర్దూ అధ్యాపకులు ఫయాస్ షారిబ్, మక్బూల్ అహ్మద్‌లు ఆయనను ఘనంగా సన్మానించారు.

తెలుగుతల్లి విగ్రహ ఏర్పాటుకు వినతి



వీసీకి వినతిపత్రం, పుస్తకాలు అందజేస్తున్న గానుగపెంట

వైవీయూ : యోగివేమన యూనివర్సిటీ ప్రాంగణంలో తెలుగుతల్లి విగ్రహం ఏర్పాటు చేసేందుకు అనుమతినివ్వాలని మహాకవయిత్రి మొల్లసాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి జీవీ మనోజ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. తెలుగు తల్లి విగ్రహాన్ని ఇచ్చేందుకు దాతలు సిద్ధంగా ఉన్నారని వారు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మలకు వినతి పత్రం, తన రచనలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్సిటీలో తెలుగు భాష అమలుకు ప్రాధాన్యత నివ్వాలని, అలాగే మహాకవయిత్రి మొల్లపై సాహితీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం వీసీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రగిరి రెడ్డయ్య, మొల్ల సాహితీ పీఠం కార్యవర్గ సభ్యుడు షేక్ జియావుల్ల పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



ఆలంఖాన్‌పల్లె సచివాలయం వద్ద సీపీఐ నాయకుల నిరసన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఇళ్ల స్థలాలకు అర్హుల జాబితా తయారు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. నగరంలోని ఆలంఖాన్‌పల్లె సచివాలయం ఎదుట శుక్రవారం పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం హామీల అమలుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉద్ధృతం చేస్తామని వివరించారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా, తాలూకా జోన్ కార్యదర్శి సావంత్ సుధాకర్, సీపీఐ సీనియర్ నాయకులు నాగరాజు, సోమవరపు సుబ్బరాయుడు, చెంచయ్య, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపం.. ప్రజలకు శాపం



దేవుని కడప వైపు గౌస్‌నగర్‌ను ఆనుకొని ఉన్న మురుగు కాలువ



కేసీ కెనాల్‌పై ఎలాంటి రక్షణ గోడలు లేని దారి

- గౌస్‌నగర్‌లో సమస్యల తిష్ట
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ప్రజలకు తప్పని ఇక్కట్లు

కడప రూరల్ : కడప నగరంలోని గౌస్‌నగర్‌ను సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. ప్రధానంగా పారిశుద్ధ్య లోపం తాండవిస్తోంది. ఇది ప్రజలకు పెద్ద శాపంగా మారింది. గౌస్‌నగర్‌కు కాలువలు పెద్ద సమస్యగా మారాయి. దేవుని కడపకు వెళ్లే మార్గంలో గౌస్‌నగర్‌ను ఆనుకొని ఒక మురుగు కాలువ ప్రవహిస్తోంది. పై భాగాన కేసీ కెనాల్ ఒక పెద్ద కాలువలా మారింది. ఈ కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోయింది. గుర్రపుడెక్క తదితర మొక్కలు పెరిగాయి. కేసీ కెనాల్‌కు ఇరు వైపులా గౌస్‌నగర్ విస్తరించి ఉంది. అలాగే కెనాల్‌కు ఒకవైపు కంప చెట్లతో అడవిని తలపిస్తోంది. ఈ కాలువలు మురికి కూపంలా మారడంతో అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తోంది. దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారు. కాలువలతోపాటు పరిసరాలను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే కాలువపై ఒక ప్రాంతంలో రాకపోకలు సాగించడానికి హైలెవల్ బ్రిడ్జి తరహాలో ఒక వంతెన నిర్మించారు. మరొక చోట ఎలాంటి రక్షణ గోడలు నిర్మించకుండా కాలువపై దారిని ఏర్పాటు చేశారు. పొరపాటున ఏదైనా జరిగితే కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. ఇక్కడ రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

దోమలు ఎక్కువగా ఉన్నాయి



చుట్టూ మురుగు కాలువలు, అపరిశుభ్రత కారణంగా దోమలు ఎక్కువగా ఉన్నాయి. అధికారులు చర్యలు చేపట్టాలి. ఇక్కడ వందలాది మంది ప్రజలు నివసిస్తున్నారు. స్థానికుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి. – నారాయణ, గౌస్‌నగర్, కడప

సమస్యలు పరిష్కరించాలి



స్థానికంగా సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ప్రధానంగా పారిశుధ్య లోపం ఉంది. వీటి పరిష్కారానికి అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలి. పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలి.
– షేక్ అమానుల్లా, గౌస్‌నగర్, కడప

రోజూ తాగునీటి సరఫరాకు ప్రణాళిక



లింగంపల్లె వాటర్ వర్క్స్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో ప్రతి రోజు తాగునీటిని సరఫరా చేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం లింగంపల్లె, బండికనుమ ప్రాంతాలను ఆయన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. లింగంపల్లె నుంచి వచ్చే నీరు బండికనుమ నుంచి కడప నగరానికి ఏ విధంగా సరఫరా అవుతుందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. హెడ్ వాటర్ వర్క్స్ నుంచి కడప నగరానికి వచ్చే నీటి ప్రవాహ ప్రక్రియను పరిశీలించారు. పైపులైను లీకేజీలు లేకుండా మరమ్మతులు చేయాలని, ఎక్కడా నీరు వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. లింగంపల్లె వాటర్ వర్క్స్ వద్ద నిర్మిస్తున్న నీటి ఫిల్టర్లు, పంపింగ్ తీరును పరిశీలించారు. కావాల్సిన మోటారును తక్షణమే కొనుగోలు చేయాలని సూచించారు. అక్కడ పని చేసే సిబ్బంది వివరాలు తెలుసుకుని ఎక్కడా జాప్యం లేకుండా పనులు చేయాలని ఆదేశించారు. అనంతరం గండి వాటర్ వర్క్స్ వద్ద బావులను పరిశీలించి తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో నీటిసరఫరా జరిగేలా చూడాలన్నారు. పలు బావుల్లో మోటార్లను మరమ్మతులు చేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, ఈఈ నారాయణ స్వామి, డీఈ చంద్రశేఖర్, ఏఈ అంజలీకుమార్ పాల్గొన్నారు.

పిల్లలను చట్టప్రకారం దత్తత తీసుకోవాలి



దత్తత తీసుకునే విధానంపై వివరిస్తున్న అధికారులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : సంతానం లేని తల్లిదండ్రులు చట్టప్రకారమే పిల్లలను దత్తత తీసుకోవాలని జిల్లా ప్రొటెక్షన్ ఆఫీసర్ సునీత, శిశు గృహ మేనేజర్ కుమారి తెలిపారు. నగరంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ దత్తత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం కిశోరీ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని మహిళాభివృద్ధి, స్త్రీశిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని, పిల్లలు లేని వారు స్వీకరించేందుకు ఈ కార్యక్రమం వరం లాంటిదన్నారు. సోషల్ వర్కర్ విజయకుమారి, పద్మిని, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

అనాలోచిత నిర్ణయాలతో భవిష్యత్తును కోల్పోరాదు

బాలికలు, యువతులు అనాలోచిత, తొందరపాటు నిర్ణయాలతో భవిష్యత్తును కోల్పోరాదని పోక్సో చట్టం జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి, న్యాయవాది ఆర్ఆర్ సునీతరాజు తెలిపారు. కడప నగరంలోని గాయత్రి జూనియర్ కాలేజీలో బాల్య వివాహాల చట్టం, పోక్సో చట్టం, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098తోపాటు పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సామాజిక కార్యకర్త లక్ష్మీప్రసన్న, వార్డు మహిళా పోలీసు ప్రసన్నలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిని మృతికి సంతాపం



నిఖితశర్మకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల (రిమ్స్)లో వైద్య విద్యను అభ్యసిస్తున్న 2023 బ్యాచ్ వైద్య విద్యార్థిని నిఖిత శర్మ (22) ఈ నెల అనారోగ్యంతో బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన నిఖిత శర్మ నీట్ పరీక్షల్లో 612 మార్కులు సాధించి కడప వైద్య కళాశాలలో 2023 బ్యాచ్‌లో వైద్య విద్య అభ్యసించేందుకు వచ్చారు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం పరీక్షలను రాసి ఉత్తీర్ణులయ్యారు. ఈ క్రమంలో ఆమె అనారోగ్యం పాలయ్యారు. ప్రాథమికంగా కడప రిమ్స్ ఆసుపత్రిలోనే చికిత్స తీసుకున్నారు. తరువాత మెరుగైన వైద్యసేవల కోసం బెంగళూరుకు పంపించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. ఆమె మృతికి కడపలోని ప్రభుత్వ వైద్యకళాశాల వైఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, అన్ని విభాగాల హెచ్‌ఓడీలు, వైద్యులు, సిబ్బందితోపాటు, సహచర విద్యార్థులు తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ట్యాంకర్‌తో నీటి సరఫరా

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం 27వ డివిజన్ గౌస్‌నగర్‌లో గత పది రోజుల నుంచి నీళ్లు రావడం లేదని జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు లయన్ పటాన్ ఖాదర్‌బాషా తెలిపారు. ఈ విషయమై పలుమార్లు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు మొరపెట్టుకున్నామని పేర్కొన్నారు. అయినా వారు పట్టించుకోలేదని పేర్కొన్నారు. దీంతో తాను స్పందించి సొంత నిధులతో శుక్రవారం వాటర్ ట్యాంకర్‌లను తెప్పించి నీరు సరఫరా చేసినట్లు తెలిపారు. ఇందుకు కాలనీవాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

కాలాష్టమి పూజల్లో న్యాయమూర్తి దంపతులు



న్యాయమూర్తి శ్రీదేవి దంపతులను సత్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కడప కల్చరల్ : కడప నగరంలోని బాసట స్వచ్ఛంద సేవా సంస్థ దత్తత గ్రామమైన శ్రీ కాలభైరవపురం(ఎమ్మెస్ కొట్టాల)లోని శ్రీ ఇష్ట కామ్యార్థ కాలభైరవ స్వామి దేవస్థానాన్ని శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, రామారావు దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కూష్మాండదీప సేవారాధన కార్యక్రమం నిర్వహించారు. బాసట నిర్వాహకులు డీపీ కార్తీక్ రెడ్డి ఆలయ చరిత్రను వివరించి వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాసట ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణానికి చర్యలు

కడప కల్చరల్ : యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలోని సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయ అభివృద్ధిలో భాగంగా నూతన భవనం నిర్మాణ పనులను ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్(ఏపీ ఈ డబ్ల్యూ ఐడీసీ)కు అప్పగించారు. శుక్రవారం విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ఏపీ ఈడబ్ల్యూ ఐడీసీ ఇంజినీర్ గురివిరెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కడప నగరంలోని బ్రౌన్ గ్రంథాలయ ప్రాంగణంలో నిర్మించనున్న ఈ నూతన భవనానికి రూ.3.66 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యోగివేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, ఆచార్య చంద్ర ఓబులరెడ్డి, డీఈ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వైవీయూ, కేరళ క్రైస్ట్ కళాశాల మధ్య ఎంఓయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వైవీయూ, క్రైస్ట్ కళాశాల అధికారులు

వైవీయూ : యోగివేమన విశ్వ విద్యాలయం ఎర్త్ సైన్సెస్ విభాగం, కేరళలోని ఇరింజలగూడ క్రైస్ట్ కాలేజీ(అటానమస్) జియాలజీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి సమక్షంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ఎర్త్ సైన్సెస్ హెచ్‌ఓడీ ఆచార్య తుమ్మలకుంట శివప్రతాప్, లక్ష్మీప్రసాద్, క్రైస్ట్ కాలేజీ ఆచార్యులు లింటో అలప్పట్, డాక్టర్ రేష్మి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అకడమిక్‌గా పరిశోధనల పరంగా పరస్పర ప్రయోజనాల కోసం ఈ ఎంఓయూ కుదుర్చుకున్నట్లు వారు తెలిపారు. జియోలాజికల్‌గా కడప బేసిన్ ఎంతో ప్రాధాన్యత కలదని.. తమ విద్యార్థులు పరిశోధనలు, అలాగే సాంకేతిక పరంగా ప్రయోజనాలు పొందుతారని అభిప్రాయం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి సందర్శన, స్ట్రాటిగ్రఫీ, హైడ్రోజియాలజీ, నీటి వనరుల మోడలింగ్‌లపై వైవీయూ, క్రైస్ట్ కళాశాల విద్యార్థులు, పరిశోధకులు పరస్పర అవగాహన పొందుతారని వివరించారు.

పాఠశాలల పని వేళల పెంపు సరికాదు



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆపస్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టనున్న పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయం తక్షణం ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) కడప జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, కొండారెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షిని తమ కార్యాలయంలో ఆపస్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల పని సమయం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొడిగించడం వల్ల ఉపాధ్యాయులే కాకుండా విద్యార్థులు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇప్పుడు ఉన్న పనివేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. వెంకటరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, శ్రీనివాసులు, చంద్రమోహన్, సుబ్బ నరసయ్య, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఈటీ

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో కడప మున్సిపల్ కార్పొరేషన్ గాంధీనగర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ నెల 17,18,19 తేదీలలో చిలుకలూరిపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో అండర్– 14 క్యాటగిరి విభాగంలో వినయ్‌కుమార్, అకాష్, యశ్వంత్, రవికుమార్ ప్రథమ స్థానం, అండర్– 17 విభాగంలో యశ్వంత్, దీపు, మణికంఠ ద్వితీయ స్థానం సాధించారు. వీరిని శుక్రవారం ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఆశ్రిఫున్ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీరు జనవరిలో నరసరావుపేటలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ స్కూల్ పీఈటీ రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

అండర్ 17 అథ్లెటిక్ పోటీలకు..



శ్రీలతారెడ్డిని అభినందిస్తున్న హెచ్‌ఎం షర్మిలారాణి

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం హెడ్ పోస్టాఫీస్ వద్ద ఉన్న గవర్నమెంట్ ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న శ్రీలతారెడ్డి జాతీయ స్థాయి అండర్–17 అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు షర్మిలారాణి తెలిపారు. ఈ నెల 3 నుంచి 5 వరకు శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో భాగంగా 400 మీటర్ల రన్నింగ్‌తో మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించిందని ఆమె పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి 30 వరకు లక్నోలో జరిగే జాతీయ స్థాయి అండర్ 17 పోటీలలో పాల్గొననున్నట్లు వివరించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు శుక్రవారం బయల్దేరుతున్న సందర్భంగా శ్రీలతారెడ్డిని హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ మంజులతా, సీనియర్ ఉపాధ్యాయులు గాయత్రి, శారద, కోచ్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు..



ఎంపికైన విద్యార్థి రామ్ హోనేష్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ 10వ తరగతి విద్యార్థి రామ్ హోనేష్ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–17 బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. శుక్రవారం పెద్ద చెప్పలి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ అండర్–17 బాలుర విభాగం ఎంపికల్లో చక్కటి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా క్రీడాకారున్ని పాఠశాల ప్రిన్సిపాల్ యు. శ్రీనివాసమూర్తి, హెచ్‌ఎం రహమతుల్లా, ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్, కోచ్ సుమంత్ అభినందించారు.

చిత్రకళలో జిల్లాకు ప్రత్యేక స్థానం




గ్యాలరీలోని చిత్రాలు తిలకిస్తున్న విద్యార్థులు

కడప కల్చరల్ : చిత్రకళలో మన జిల్లాకు పలు ప్రత్యేకతలు ఉన్నాయని ఇంటాక్ సభ్యులు మంజులారెడ్డి అన్నారు. భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) వారసత్వ వారోత్సవాలలో భాగంగా ఐదో రోజు శుక్రవారం కడప నగరం నాగరాజుపేట మున్సిపల్ హైస్కూలు విద్యార్థులచే ఉపాధ్యాయుడు, ఇంటాక్ సభ్యుడు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఎన్జీఓ కాలనీలోని కళాకృతి ఆర్ట్ గ్యాలరీని సందర్శింపజేశారు. ఈ సందర్భంగా చిత్రకారుడు రాఘవేంద్రవర్మ మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభ గల ఎందరో చిత్రకారులు ఉన్నారని, వారి ప్రతిభను ప్రపంచానికి చాటాలని డాక్టర్ మాధవి ఈ ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేశారన్నారు. అనంతరం నిర్వాహకులు ఆర్ట్ గ్యాలరీలోని అన్ని విభాగాల చిత్రాలు, వాడే రంగులు, వేసే పద్ధతులు తదితరాలను విద్యార్థులకు వివరించారు. తర్వాతి విభాగంలో నాగరాజుపేటలోని మున్సిపల్ హైస్కూలులో సుగవాసి గంగాధర్, మంజులారెడ్డి, సుభఖ్ తాహిన్, సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వారసత్వ సంపద గురించి వివరించి 30 మంది బాల బాలికలతో హెరిటేజ్ క్లబ్ ఏర్పాటు చేశారు.

అన్నదానం

కడప అర్బన్ : హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన మార్కాపురం ముకుంద, వీణ వివాహం రోజు సందర్భంగా కుమార్తె డాక్టర్ అపూర్వ, కుమారుడు అమయ్ కడప నగరంలోని ప్రేమాలయ నిరాశ్రయుల నివాస వసతి గృహంలో నిరాశ్రయులకు, వృద్ధులకు అన్నప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, పుట్టా పురుషోత్తం, ఆర్టీసీ రిటైర్డ్ కండక్టర్ వెంకట సురేష్‌బాబు, రెడ్డి లక్ష్మణ్, ఆశ్రమ నిర్వాహకుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గిజిగాడి గూడు.. నైపుణ్యం చూడు









అందంగా గూడు నిర్మించడంలో గిజిగాడి నైపుణ్యం గొప్పది. ఈ పిచ్చుక అల్లిక చూసి ఎవరైనా అబ్బుర పడాల్సిందే. సన్నటి గడ్డి పరకలతో సుందరంగా గాలి ఊయలలాగా ఈ పక్షులు గూళ్లను తయారు చేసుకుంటాయి. చెట్టు చిట్టచివరి కొమ్మలకు శత్రు దుర్భేద్యంగా గూడు నిర్మించుకుంటాయి. వాటిలో గుడ్లు పెట్టి పొదిగి, పిల్లలకు రెక్కలు వచ్చేదాకా కాపాడుకుంటాయి. పాముల బారిన తమ పిల్లలు పడకుండా ఇలా చేసుకుంటాయి. చెట్లు, కాలువలు, నీరు ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా నిర్మించుకుంటాయి. కడప నగర శివారు ప్రాంతాలు గిజిగాడి ఆవాసానికి ఆలవాలం. ఈ పక్షులు అక్టోబర్, నవంబర్‌లో గూడు ఏర్పాటు చేసుకుంటాయి. రెండు పక్షులు జతకూడి పిల్లలకు జన్మనిచ్చి, పెంచి ఫిబ్రవరిలో గూడి విడిచి మరో ప్రాంతానికి వెళ్లిపోయాయి. ఇలా చింతకొమ్మదిన్నె మండలం బుగ్గవంక కాలువ వద్ద ఈత చెట్టుపై గూడు నిర్మించుకుంటున్న గిజిగాళ్లు 'సాక్షి' కెమెరా కంటపడ్డాయి.

– సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప